

శ్రీవారి సేవలో 'తండేల్' మూవీ టీమ్

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తండేల్ చిత్ర బందం సభ్యులు దర్శించుకున్నారు. గురువారం స్వామి వారి విఐపీ విరామ సమయంలో చిత్ర కథానాయకుడు నాగ చైతన్య, కథానాయకి సాయి పల్లవి, దర్శకుడు చందూ మొండేటి, చిత్ర నిర్మాతలు అల్లు అరవింద్, నాగ వంశీలు స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి, పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల దర్శకుడు చందూ ముండేటి మాట్లాడుతూ సినిమా ఘనవిజయం సాధించడంతో చిత్ర సభ్యులంతా శ్రీవారి దర్శనార్థం వచ్చామని తెలిపారు.

కోళ్ల పరిశ్రమపై

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటివరకు బర్డ్ ఫ్లూ లక్షణాలతో కోళ్లు ఎక్కడా చనిపోలేదని, బర్డ్ ఫ్లూ పట్ల పౌల్ట్రీ పరిశ్రమ రైతులు, ప్రజలకు ఆందోళన అక్కర్లేదని, బర్డ్ ఫ్లూ లక్షణాలు పశ్చిమగోదావరి జిల్లాలో ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించామే తప్ప ఎక్కడ భయాందోళనలకు గురికావలసిన అవసరం లేదని పశుసంవర్ధన శాఖ అధికారులు అంటున్నారు. అయితే బర్డ్ ఫ్లూ ప్రభావంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమ రైతులు అధికారుల ప్రకటనలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కోళ్ల ఫారాలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- ప్రకటనలపై పౌల్ట్రీ రైతుల అసంతృప్తి
- సరిహద్దుల్లో చెక్‌పోస్టులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1750 పౌల్ట్రీ ఫారాలు

ప్రజాశక్తి- యాదమరి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 1750 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. నెలకు సరాసరి 75 లక్షల కోళ్లు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 50 లక్షలు మేర ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లా పౌల్ట్రీ పరిశ్రమలో 30వేల మంది ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో పౌల్ట్రీలో కోటి మూడు లక్షల ఇరవై వేలకు పైగా కోళ్లు పెంపకం చేస్తున్నారు. అందులో కోళ్లు 58,41608, లేయర్స్ 36,56123, పెరటి కోళ్లు, 823121, బాతులు 1821, మొత్తం 10 సంవత్సర శాఖ గణాంకాల ప్రకారం ఒక కోటి మూడు లక్షల 20 వేలకు పైగా కోళ్లు పెంపకం చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉన్న నేపథ్యంలో మొదట సంవర్ధక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా సరిహద్దులైన తమిళనాడు, కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దుల్లో పౌల్ట్రీ దిగుమతులు జిల్లాలోకి అనుమతించకుండా, ముందుస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెవెన్యూ, పోలీసు, శాఖల సమన్వయంతో పౌల్ట్రీ దిగుమతులను లోనికి రాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు.

జిల్లాలోని అన్ని పౌల్ట్రీ ఫారాల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ రైతులకు బయో సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తూ సూచనలు సలహాలు ఇస్తున్నారు.

చికెన్ తినడం వల్ల బర్డ్ ఫ్లూ రాదు..

బర్డ్ ఫ్లూ ఏవిఎన్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఈ వైరస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే చనిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మాంసం కోడిగుడ్డును మనం 150 నుంచి 200 డిగ్రీల ఉష్ణోగ్రత స్థాయిలో ఉడికించిన తర్వాతే తీసుకుంటాం కాబట్టి వైరస్ ప్రభావం ఉండదు. మైనస్ డిగ్రీల్లో ఉండే దేశాల్లో ఇది మనుషులకు వ్యాపిస్తుంది. ఆంధ్రప్రదేశ్లో ఉండే ఉష్ణోగ్రతలు కోడి మనుగుడుకు అనువైనవి కోడిలో రోగనిరోధక శక్తి పెరిగేందుకు తగిన మందులు ఇవ్వడం ద్వారా ఈ వైరస్ ప్రభావం పెద్దగా ఉండదు.

కోడి గుడ్డు, మాంసం పౌష్టికాహారం

- ఎం.సుబ్రహ్మణ్యం నాయుడు పౌల్ట్రీ అడ్వైజర్, చిత్తూరు

చికెన్, కోడిగుడ్డు వాడకంపై అధికారులు చేసిన ప్రకటనలపై పౌల్ట్రీ రైతులు నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో ఎక్కడ గాని బర్డ్ ఫ్లూ అనేది లేదు. వదంతులను నమ్మి ఇమ్యూనిటీ పెంచడంలో పౌష్టికాహారంలో చికెన్, కోడిగుడ్డు అగ్రామి అపోహలతో ప్రోటీన్ అందిస్తున్న మాంసంకు దూరం కావద్దు. భారతీయుల వంట విధానంలో ఏ వైరస్ ఆరోగ్యంపై ప్రభావితం చేయదని, కరోనా సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఎందరో మేధావులు, శాస్త్రవేత్తలు డాక్టర్లు తెలిపారు. వ్యాధి నిరోధకంగా ఇమ్యూనిటీని పెంచడంలో కోడి గుడ్డుదే ప్రముఖ పాత్ర.

ఆందోళన అక్కర్లేదు.. జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు

- ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, చిత్తూరు జిల్లా

పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉండి కోళ్ళు చనిపోవడంతో జిల్లాలో అన్ని మండలాల్లోని పశు సంవర్ధక శాఖ అధికారులను అప్రమత్తం చేసాం. కోడిగుడ్డు, కోడి మాంసంను ఉడికించినప్పుడు 50 డిగ్రీలు దాటితే వైరస్ చనిపోతుంది. గుడ్డు మాంసంను మనం 150 నుంచి 200 డిగ్రీలు ఉష్ణోగ్రస్థాయిలో ఉడికించి తర్వాతే తీసుకుంటాం కనుక మనపై వైరస్ ప్రభావం ఉండదు. కోళ్ల పరిశ్రమ రైతులకు శానిటేషన్, బయో సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్నాం. పౌల్ట్రీ ఫారన్లు కోళ్లు చనిపోతే వెంటనే సమీపంలోని పశు వైద్యులకు తెలియజేయాలని ముందు జాగ్రత్త చర్యలుగా పౌల్ట్రీ రైతులకు సూచించాం

బర్డ్‌ఫ్లూ ప్రమాదకరం కాదు : డీన్ శ్రీలత

ప్రజాశక్తి - క్యాంపస్ రాష్ట్ర వ్యాప్తంగా కోళ్లకు సంభవించే బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రమాదకరమైంది కాదని శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విద్యాలయం డీన్ డాక్టర్ శ్రీలత పేర్కొన్నారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ దీనివలన ప్రజలకు ఎలాంటి వైరస్ సంక్రమించే అవకాశం లేదన్నారు. శీతాకాలంలో కోళ్లకు సంబంధించి ఈ బర్డ్ ఫ్లూ వ్యాధి తరచూ వస్తూ ఉంటుందని, దీనికి సరైన చికిత్స చేసుకోవడం ద్వారా నయం అవుతుందని అన్నారు. దీని వలన ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రావు

కల్లాల వద్ద రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘాల నేతలు

ధాన్యానికి గిట్టుబాటు కల్పించాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం

రబీ సీజన్‌లో ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, 75 కేజీల బస్తా రూ.2500 ఇవ్వాలని రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఆర్.సుబ్బరాయుడు, రైతుసంఘాల సమాఖ్య సూళ్లూరుపేట ఏరియా నాయకులు చింతంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. గురువారం దొరవారిసత్రం మండల పరిధిలో వేణుంబాక, వెదురుపట్టు, రాజుపాలెం గ్రామాల్లో ధాన్యం కల్లాల దగ్గరకు వెళ్లి రైతులను ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 75 కేజీల ధాన్యం బస్తా రూ.1650కి అడుగుతున్నారని, గత ఏడాది ఈ సీజన్‌లో 2,200 ధర పలికిందన్నారు. ముసురు వర్షాలతో వరి పంట సక్రమంగా రాలేదని, చీడపీడల వల్ల దిగుబడి బాగా తగ్గిందని, గత ఏడాది ఎకరాకు 40 బస్తాలు పండగా, ఈ ఏడాది కేవలం 25కే పరిమితమయ్యిందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని బస్తా మీద కనీసం రూ.500 బోనస్‌గా ఇవ్వాలన్నారు. రైతులకు గిట్టుబాటు కావాలంటే బస్తా 2,500 రూపాయలు, పుట్టి 28,750 ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతులు ఎస్‌కె షబ్బీర్, చాంద్‌బాషా, షేక్ మస్తాన్‌లు తమ బాధలను సంఘం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు.

'జల్‌జీవన్'లో 1.76 లక్షల కొత్త కనెక్షన్లు

తిరుపతి టౌన్ : తిరుపతి జిల్లాలో 'జల్‌జీవన్ మిషన్' అమలుపై తిరుపతి ఎంపి గురుమూర్తి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి వి.సోమన్న సమాధానం ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కనెక్షన్లను అందించడమే లక్ష్యంగా 2019, ఆగస్టులో ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభ సమయానికి తిరుపతి జిల్లాలో కేవలం 2.40 లక్షల గ్రామీణ ఇళ్లకు (57.58 శాతం) తాగునీటి కనెక్షన్లు ఉన్నాయన్నారు. గత ఐదేళ్లలో 1.76 లక్షల కొత్త కనెక్షన్లు అందించారని, ప్రస్తుతం 4.16 లక్షల ఇళ్లకు (99.82 శాతం) తాగునీటి కనెక్షన్లు ఉన్నాయన్నారు. 1.19 లక్షలు ఎస్సీలకు, 26వేలు ఎస్టీ కుటుంబాలకు ఇచ్చామన్నారు. తిరుపతి జిల్లాలోని 908 గ్రామాలలో 901 గ్రామాలకు గ్రామ నీటి, పారిశుద్ధ్య కమిటీలు ఉన్నాయన్నారు. ప్రతి గ్రామీణ ఇంటికి 55 లీటర్ల తాగునీరు రోజుకు అందించే లక్ష్యం కోసం జల్ జీవన్ మిషన్ వేగంగా పురోగమిస్తోందని అన్నారు.

స్పర్శ లేని మచ్చలపై అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్పర్శ లేని రాగి మచ్చల పట్ల అశ్రద్ధ చేయొద్దని డిప్యూటి పారామెడికల్ ఆఫీసర్ యన్.జోబు పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే ఎండిటీ కోర్స్ తో పూర్తిగా నయం చేయొచ్చని సూచించారు. స్పర్శ లేని రాగి మచ్చలు ఉన్నవారు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఉచితంగా మందులు పొందచ్చని తెలిపారు.

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని పొయ్య, రౌతుసూరమాల సచివాలయాల్లో గురువారం స్విమ్స్ ఆసుపత్రి, తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్తంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ సిబ్బంది క్యాన్సర్ వ్యాధిపై చిత్రపటాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పింక్ బస్సుల ద్వారా మహిళల్లో, పురుషుల్లో నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాధిని నిర్ధారించవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 14న పెద్ద కన్నలి, బసవయ్య పాలెంలో, 17న సాంబయ్యపాలెం, తొట్టంబేడులో, 18న శివనాథపాలెం, చిట్టతూరులో, 20న కంచనపల్లిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష జరుగుతాయనీ, ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొట్టంబేడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లహరిణి, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, డాక్టర్ హరిత, ఎంపిపి భర్త వాసుదేవనాయుడు, సర్పంచులు కె.సక్కుబాయమ్మ, మాధవి, పావనిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డి.మురళి, మణి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ భాషలలో పుస్తక రచనా లేఖకుల కార్యశాల

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతిలోని స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో భారతీయ భాషల్లో పుస్తక రచన లేఖకుల కార్యశాల గురువారం ఘనంగా ప్రారంభమైంది. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, భారతీయ భాషా సమితి, కేంద్రీయ సంస్కత విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతి సంయుక్తాధ్వర్యంలో వివిధ భారతీయ భాషలలో హైయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్స్ లో వివిధ సబ్జెక్ట్స్ నకు సంబంధించిన అంశాలను 22 భాషలలో పుస్తక రచనా లేఖకుల కార్యశాల ప్రారంభోత్సవం విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు కాన్ఫరెన్స్ హాలు నందు ఘనంగా నిర్వహించారు. భారతీయ భాషా సమితి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం నోడల్ ఆఫీసర్ డా.సూర్యప్రసాద్ ముందుగా కార్యశాల ప్రాస్తావికాన్ని వివరించారు. రాష్ట్రపతి పురస్కార గ్రహీతలు ప్రొ.చాంద్ కిరణ్ సలూజ విచ్చేసి పుస్తక రచనలో అనుసరించవలసిన నియమనిబంధనలు, ఏవిధంగా ఆకర్షణాత్మకంగా పుస్తకాలు రాయాలో వివరించారు. విశిష్టాతిథి కేంద్రీయ సంస్కత విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ వైస్-చాన్సలర్ ప్రొ.శ్రీనివాస వర్కేడి, సారస్వతాతిథి ప్రొ.కొంపెల్ల రామసూర్యనారాయణ, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ.ఎస్.దక్షిణామూర్తి శర్మ పాల్గొన్నారు.

ఉపకార వేతనం పెంచి 'వెలుగు'లు నింపండి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం యుజి, పిజి విద్యార్థులకు 'ఉపకార వేతనాన్ని పెంచండి.. మా జీవితాల్లో వెలుగు నింపండి' అని పశువైద్య విద్యార్థుల సంఘం నేతలు గురువారం డిమాండ్ చేశారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ ఉపకార వేతనం పెంచాలని కోరుతూ నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరుకుంది. ఏడవ రోజు రిలే నిరవధిక దీక్ష లో భాగంగా వెటర్నరీ క్లినిక్ కాంప్లెక్స్ ను పశువులకు వైద్యం అందించకుండా పూర్తిగా

మూసివేసి క్లినికల్ సేవలను అందించకుండా నిరసన వ్యక్తం చేశారు. బర్డ్ ఫ్లూ వైరస్ విజంభిస్తున్న నేపథ్యంలో పశు వైద్యుల ఆవశ్యకతను రాష్ట్రం మొత్తం తెలుసుకున్న సందర్భంలో విద్యార్థులు తమ నిరసనలో భాగంగా హాస్పటల్ ను మూసేయడం, రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ సేవలను నిలిపివేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

'తిరుమల దృశ్యకావ్యాన్ని' తిలకించిన కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి ట్రెక్కింగ్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టు రాఘవ రచించిన 'తిరుమల దృశ్యకావ్యం, శేషాచల కొండల్లో' పుస్తకాలను కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ ఆసక్తిగా తిలకించారు. గురువారం రాఘవ వారిరువురినీ కలిసి పుస్తకాలను అందజేశారు. పుస్తకాలను ఆసక్తిగా తిలకించిన కలెక్టర్, జేసీలు ట్రెక్కింగ్ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. తిరుమలలో ఎన్ని తీర్థాలు ఉన్నాయి, ఎలా వెళ్లాలి అని అడిగారు. తాము ట్రైనింగ్‌లో ఉన్నపుడు ట్రెక్కింగ్ చేశామని, ఆ తరువాత వెళ్లలేదన్నారు. ఇప్పటికీ తాము ట్రెక్కింగ్‌కు వెళుతున్నామని రాఘవ చెప్పేసరికి, తమకూ ఆసక్తి ఉందని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ట్రెక్కింగ్ క్లబ్ ప్రధాన సభ్యులు మధు, శ్రీహరి, తిరుమలరెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, బ్రహ్మమధు, రవి, కార్తీక్, జైబాలాజీ ఉన్నారు.

హోంసైన్స్‌లో నైపుణ్య శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హోం సైన్స్ డిపార్ట్మెంట్ నుండి స్కిల్ డెవలప్మెంట్ వర్క్ షాప్ ను పీజీ స్టూడెంట్స్‌కు, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ స్టూడెంట్స్‌కు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జాతీయస్థాయి ట్రైనర్ మధుసూదన రజన విచ్చేసి అవగాహన కల్పించారు. పోస్టుగ్రాడ్యుయేషన్ ముగించుకుని ఉద్యోగ వేటలో ఉపయోగించుకునే కమ్యూనికేషన్ స్కిల్స్, అబ్జర్వేషన్ స్కిల్స్, ప్రాక్టీస్ స్కిల్స్‌ను ఇన్నోవేటివ్ ఉదాహరణలతో నేర్పించారు. డిపార్టుమెంట్ హెడ్ ప్రొఫెసర్ అరుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

'రాస్' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రేణిగుంట : రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ తిరుపతి వారి సహకారం- సౌజన్యంతో ఇన్స్టిట్యూట్ ఆవరణలో రుయా హాస్పిటల్ వారికి మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ల అధినేత డాక్టర్ సి. రామచంద్రారెడ్డి విచ్చేసి ఆరంభించి, మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ప్రాణాలను కాపాడేందుకు తమ కళాశాల విద్యార్థిని విద్యార్థులు తమ వంతు సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ నాదముని రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాణదాతలుగా మారి రక్తాన్ని అందించినందులకు గర్వంగా ఉందన్నారు. ఈ శిబిరంలో మొత్తం 182 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో నిరంజన్ రెడ్డి, కేశవులు, నరసింహులు, రుయా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి డాక్టర్ హరిత బందం, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ట్రస్టీలు సుబ్బరత్నమ్మ, మస్తానమ్మ పాల్గొన్నారు.

మినిమం టైంస్కేల్ సాధనకై...

16న జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబర్ 2ను సవరించి, అందరికీ ఎంటిఎస్ అమలు చేయాలని, సుప్రీం తీర్పు అనుసరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న జరగనున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ జెఎసి ఛైర్మన్ గండికోట నాగ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. స్విమ్స్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, జెఎసి ఛైర్మన్ నాగేశ్వరరావు, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, కె.వేణుగోపాల్, చినబాబు, గండికోట నాగ వెంకటేష్, స్విమ్స్ కాంట్రాక్టు కార్మికులు సంఘం అధ్యక్షుడు రవి, కార్యదర్శి ముత్తు, కోశాధికారి సూరి, కార్మికులు గోపి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జూపార్కు వర్కర్స్ నూతన కమిటీ ఏర్పాటు

ఆర్థిక శాఖ అనుమతి ఉన్నవారికి మాత్రమే మినిమం టైంస్కేలు వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 12 పేర్లతో ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న అందరికీ ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, కార్యదర్శి ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. మినిమం టైంస్కేలు సాధన కోసం ఈనెల 16న జిల్లాస్థాయి సదస్సు జరుగుతుందన్నారు. గురువారం జూపార్కు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జనరల్‌బాడీ సమావేశం జరిగింది. అనంతరం 22 మందితో నూతన కమిటీ ఎంపికయ్యింది. అధ్యక్షులుగా బాబు, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మునికృష్ణారెడ్డి, టి.మదన్‌మోహన్‌రెడ్డి, తులసిరామిరెడ్డి, సుదర్శన్, కార్యదర్శులుగా దిలీప్‌కుమార్, మునిరత్నం, ప్రశాంత్, నాగరాజు ఎన్నికయ్యారు.

రాయల చెరువు పరిశీలన

ప్రజాశక్తి -రామచంద్రాపురం

జిల్లాలో నీటిపారుదల శాఖకు చెందిన రెండవ పెద్ద చెరువు అయినా రాయలచెరువును తిరుపతి జిల్లా నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ వెంకటరమణ రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాయల చెరువు పెద్దటి వంక, రాయల చెరువు పేట ఫీడర్ చానల్స్ ఆక్రమణలను తొలగించాలని, సప్లై చానల్స్ ను మరమ్మతులు చేయాలని నీటిపారుదల సంఘాల అధ్యక్షుడు కే అర్జున్ నాయుడు ఎస్ ఈ దష్టికి తీసుకెళ్లారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి రాయల చెరువుకు అభివద్ధితోపాటు మొరవ ఏర్పాటు చేయాలని ఎస్ ఈ వెంకటరమణ రాజును కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎత్తి రాజు, రాయలచెరువు నీటి సంఘాల ఉపాధ్యక్షుడు కుప్పా త్యాగరాజు పాల్గొన్నారు

పరిశ్రమల ప్రతినిధులకు దిశానిర్దేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మీనాక్షి కంపెనీ (వేదాంత పవర్), సింహపురి జిందాల్ కంపెనీ, నవయుగ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమన్వయ సమావేశం నిర్వహించి, పలు సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలపై దిశా నిర్దేశం చేశారు. గురువారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో సదరు పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులతో, జడ్‌ఎం ఎపిఐఐసి నెల్లూరు శివప్రసాద్‌తో సంబంధిత మ్యాప్‌లను పరిశీలించి, ఎన్‌హెచ్‌ఎఐ నెల్లూరు వారితో పలు అంశాలపై చర్చించారు.

సహకార సంఘాల వ్యవస్థను బలోపేతం చేయాలి : కలెక్టర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాల వ్యవస్థను బలోపేతం చేయడానికి పలు చర్యలు చేపడుతున్నాయని, 2025 అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించారని, ప్రతి రైతు ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో సభ్యులుగా నమోదు కావాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఛైర్మన్ హోదాలో, జేసీ శుభంబన్సల్‌తో కలిసి జిల్లా సహకార అభిబుద్ధి కమిటీ తొలి సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. 28న జిల్లాస్థాయిలో చిత్తూరు, నెల్లూరు జిల్లా వారిచే వర్కుషాపు ఉంటుందని, 28 వరకు నిర్వహించనున్న సహకార ఔట్‌రీచ్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలన్నారు. జిల్లా సహకార కన్వీనర్ ఎస్. లక్ష్మి, డిడిఎం నాబార్డ్ సునీల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజు పాల్గొన్నారు.

'పల్లెపండుగ' అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్దంగా నెలాఖరుకల్లా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. సిసిరోడ్లు ఈ వారం చివరకు 16 కోట్ల రూపాయలు, వచ్చే వారాంతానికి రూ.24 కోట్లు ఖర్చు చేసి మొత్తం రూ.40 కోట్ల రూపాయల పనుల పురోగతి చూపాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లక్ష్యం మేరకు ఇంజినీరింగ్, సిసిరోడ్లు నిర్మాణం, అనిమల్ షెడ్స్ పనులను వేగవంతం చేయాలన్నారు. పుత్తూరు, సత్యవేడు, నాగలాపురం, వడమాలపేట మండలాలు లక్ష్యసాధనలో వెనకబడి ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

'ఫ్లెమింగో ఫెస్టివల్' ఆల్బమ్ విడుదల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ను నిర్వహించి విజయవంతం చేసిన పర్యాటక శాఖను, అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి అభినందించారని కలెక్టర్, జిల్లా పర్యాటక కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. గురువారం పర్యాటక రంగంపై వెలగపూడి సచివాలయం మొదటి అంతస్తులో సమీక్షించిన ముఖ్యమంత్రి తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో అట్టహాసంగా ఘనంగా నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ ఆల్బమ్ పుస్తకాన్ని విడుదల చేశారు. పుస్తకం అద్భుతంగా రూపొందించారని మంత్రి కందుల దుర్గేష్, అధికార బందాన్ని సిఎం అభినందించారు.

పరిశ్రమాధిపతులతో కలిసి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



'ఫ్లెమింగో ఫెస్టివల్' ఆల్బమ్ విడుదల చేసిన చంద్రబాబు

సమిష్టిగా అభివృద్ధి : ఎంఎల్‌ఎ ఆదిమూలం

ప్రజాశక్తి -పిచ్చాటూరు

'అందరం కలిసి సమిష్టిగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం' అని ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. పిచ్చాటూరు మండల మీట్ గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగింది. ఎంపిపి హెచ్ రేఖ అధ్యక్షత వహించారు. ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం హాజరై మాట్లాడుతూ గతంలో సమితిగా ఉండేదని, ఇక్కడ అధ్యక్షులుగా పనిచేసిన ఐదుగురు ప్రజాప్రతినిధులు రాష్ట్రస్థాయిలో మంత్రులుగా, ఎంఎల్‌ఎలుగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షులుగా ఎదిగారన్నారు. అరణియార్ ప్రాజెక్టులో గత ఆరేళ్లుగా ప్రతి ఏటా 10 లక్షల చొప్పున చేప పిల్లలను తన చేతిలో వదలడం ద్వారా, మత్స్యకార్మికుల అభ్యున్నతికి కృషి జరుగుతోందన్నారు. అరణియార్ ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.35 కోట్లు జైకా పనులు నత్తనడకన జరగడంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చేపట్టాలని కోరామన్నారు. పర్యాటక అభివృద్ధికి తుడా నిధులు 1.85 కోట్లు మంజూరై పనులు జరుగుతున్నాయన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా ప్రాజెక్టు నుంచి మిట్ట ప్రాంతమైన కీలపూడి, నీరువాయి రైతుల పొలాలకు నీరు అందించేలా రూ.2 కోట్లతో ప్రణాళిక తయారు చేశామన్నారు. రేషన్‌కార్డు, ఇంటి పట్టాలేనివారు, ఇళ్లు లేని లబ్ధిదారులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మహ్మద్‌రఫీ, తహశీల్దార్ జయరామ్, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి.ఇలంగోవన్‌రెడ్డి, పద్మరాజు పాల్గొన్నారు. అనంతరం రామగిరిలోని శ్రీవాళీశ్వర స్వామి మహాశివరాత్రి పోస్టర్‌ను ఎంఎల్‌ఎ ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో ఈవో లత స్వాగతం పలికారు. పిచ్చాటూరు జిల్లా పరిషత్ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న కాంపౌండ్‌వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. రూ.38 లక్షలతో చేపట్టిన ఈ పనులు త్వరగా పూర్తి చేయడం ద్వారా పాఠశాలకు భద్రత ఉంటుందన్నారు. త్వరలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తామన్నారు.

శివరాత్రి పోస్టర్ ఆవిష్కరణ

ఎన్‌సిసితో కళాశాలకు కీర్తిప్రతిష్టలు

ఎన్‌సిసి విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొని కళాశాల కీర్తిని పెంచడం ఎంతో గర్వకారణమని డాక్టర్ బి చంద్రమౌళి అన్నారు. మూడవ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న జి అపున్ పౌల్ రాజై, బిబిఏ మూడవసంవత్సరం చదువుతున్న జి.పవన్‌లకు రిపబ్లిక్‌డే వేడుకల్లో కవాతు చేసే అవకాశం లభించింది. వారిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు. సభానంతరం ఎన్‌సిసి విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, డాక్టర్ ఏ.దేవకి, డాక్టర్ పూజారి వెంకటేశన్, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రఘురామన్, డాక్టర్ వి.వాసవి, డాక్టర్ పి.గాయత్రి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘ కాలిక వ్యాధులు దూరం

ఆయుర్వేద వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రోహిణి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు సాయిబాబా మందిరంలో గురువారం లక్ష్మీ శంకర్ ఆయుర్వేద ఆసుపత్రి 4వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ఆయుర్వేద చికిత్స ద్వారా అతి తక్కువ సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రాబోవు రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- నగరి నియోజకవర్గ వైయస్సార్సీపి ఎస్టీ సెల్ నాయకులు ఇరువారం చిరంజీవి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాబోవు రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమానికి అధిక శాతం నిధులు కేటాయించాలని నగరి నియోజకవర్గ వైయస్సార్సీపి ఎస్టీ సెల్ నాయకులు ఇరువారం చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు గిరిజన విభాగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. గిరిజన శాఖకు మంత్రిని నియమించకపోవడంతో గిరిజనులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. ఇన్నోవా వాహనాలు, ట్రై కార్ నిధుల విషయంలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాలను గురుకుల పాఠశాలలుగా మారుస్తూ గిరిజనులకు విద్యను దూరం చేశారన్నారు. అనంతరం వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గిరిజనులకు ప్రత్యేక స్థానాన్ని కేటాయిస్తూ డిప్యూటీ సీఎం, గిరిజన మంత్రి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఏర్పాటుచేశారన్నారు. మరలా టీడీపీ అధికారంలోకి రావడంతో గిరిజన సంక్షేమ పథకాలు కుంటుపడుతున్నాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు గిరిజనులకు చెందే విధంగా స్థానిక నాయకులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంపాలెం రమణయ్యకు నివాళి

రమణయ్య భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న నూకతోటి రాజేష్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బీఎన్ కండ్రిగ మండలం, కాంపాలెం వైసీపీ మాజీ సర్పంచ్ రమణయ్య, బుధవారం రాత్రి మరణించారు. సమాచారం తెలుసుకున్న సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నూకతోటి రాజేష్ మండల అధ్యక్షులు కొణతనేటి మణి నాయుడులు నాయకులతో ఆయన స్వగృహానికి చేరుకుని భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాజేష్ వేలూరు, జిల్లా క్రియేటివ్ కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, దివ్యాంగుల నియోజకవర్గ కన్వీనర్ దేవదాసు రెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, ఎయంసి చైర్మన్ ఉగ్గుముడి గురునాథం, మునిరెడ్డి, మాజీ సర్పంచ్ గురువయ్య, ప్రసాద్ పాల్, సంజీవయ్య, నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లం విద్యార్థుల విజ్ఞాన యాత్ర

విజ్ఞాన యాత్రకు వెళ్లివచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -ఏర్పేడు: పల్లం ఉన్నత పాఠశాలకు చెందిన 90 మంది విద్యార్థులు 10 మంది ఉపాధ్యాయులతో కూడిన బృందం ఈనెల 11వ తేదీన అంతరిక్ష పరిశోధన కేంద్రమైన శ్రీహరికోటను సందర్శించడం జరిగింది. ప్రస్తుత సాంకేతిక పురోగతులను అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు అవకాశమైన అనుభవాన్ని అందించడానికి ఈ సందర్శన ఏర్పాటు చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్ తెలిపారు. విద్యార్థులు ఎస్‌డిఎస్‌సి షార్ యొక్క వివిధ సౌకర్యాలను సందర్శించి, అక్కడ విద్యార్థులకు రాకెట్లను ఎలా తయారు చేస్తారు? వాటిని ఎలా అంతరిక్షంలోకి పంపుతారు వంటి విషయాలను గ్రహించడం జరిగిందని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, వికృతమాల నీలాద్రి అపార్ట్‌మెంట్‌లో గురువారం రేణిగుంట ఎస్ఐ రేణిగుంట సర్కిల్, ఏర్పేడు ఇన్‌స్పెక్టర్ జయచంద్రలు సైబర్ నేరాల వలలో పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన, మహిళల అత్యాచారాల గురించి జాగ్రత్తలపై కార్యక్రమం నిర్వహించారు.

ఎస్వీయూలో.. పారిశుద్ధ్యం పడకేసింది

- అడ్డదిడ్డంగా ఏరులై పారుతున్న మురుగునీరు
- ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం
- ప్రభుత్వం మారినా కానరాని మార్పు
- విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గత పాలకుల పుణ్యమా అని పారిశుద్ధ్యం పడకేసింది. ప్రపంచంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతిగాంచిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిత్యం ఎంతో మంది విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది సంచరిస్తూ ఉంటారు. మొదటి గేటు దగ్గర నుంచి హెచ్ బ్లాక్ వరకు వివిధ మెస్సులలో వచ్చే చెత్తాచెదారం, డ్రైనేజీ వాటర్ డి బ్లాక్ మెస్సు పక్కన ఏరులై పారుతూ ఉండడం విడ్డూరంగా ఉంది.

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్శిటీ పరిధిలో దాదాపుగా రెండు సంవత్సరాలు కాలంగా ఈ మురుగునీరును పరిశుభ్రం చేద్దామని ఆలోచన ఉన్నతాధికారులకు కానీ, సంబంధిత అధికారులకు కానీ రాకపోవడం శోచనీయం. ముఖ్యంగా ఇంజనీరింగ్ కళాశాల గేటు, నాలుగో గేటు ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాల బాలుర వసతి గృహాల నుంచి వచ్చే మురుగునీరు ఇతర డ్రైనేజీ వ్యర్థాలు ఏరులై పారుతోంది. ఇంతవరకు సంబంధిత అధికారులు దీనిని గుర్తించకపోవడం చాలా బాధాకరం. అపరిశుభ్రమైన వాతావరణ పరిస్థితుల్లో విద్యార్థులు దోమలు, ఈగలు, ఇతర బ్యాక్టీరియాలు చేరడంతో, ఎంతో మంది అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ వ్యర్థాల వల్ల పందులు సంచారం పెరిగింది. కొంతమంది బయట వ్యక్తులు వర్సిటీలో పందుల పెంపకానికి కూడా గతంలో ప్రారంభించడం జరిగింది. దీనిపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం హాస్యాస్పదం. మరోవైపు పరీక్ష ఫలితాల విడుదలలో, సర్టిఫికెట్లు సకాలంలో అందించడంలో వర్సిటీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వర్సిటీలో పరిశుభ్రత, పచ్చదనం అనే కార్యక్రమాలు గతంలో పాలకులు నిర్వహించారు. ఫోటోలకు ఫోజులు ఇచ్చి, మొక్కలను నాటారు. కొంతమంది ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, ఇతర అకడమిక్ కోఆర్డినేటర్లు వారి యొక్క కార్యక్రమాల బిల్లుల కోసమే ఇవి నిర్వహించారని వర్సిటీలో చర్చ నడుస్తోంది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా కొన్ని విభాగాల్లో అధికారులు ఇప్పటికీ మొద్దు నిద్రపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీన్ని గుర్తించి అన్ని విభాగాల అధికారులతో సమన్వయంతో వర్సిటీలో పచ్చదనం, పరిశుభ్రతను పూర్తిస్థాయిలో అమలు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు, సంబంధిత కళాశాల ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు కోరుతున్నారు.

అంగన్వాడీలకు శిక్షణ

అంగన్వాడి శిక్షణ సమావేశంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలతో సన్నిహితంగా ఉండి అభివృద్ధికి తోడ్పడాలని, వడమాల పేట మండల విద్యాశాఖ అధికారి పద్మావతి తెలిపారు. వడమాలపేట మండల పరిధిలోని జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో గురువారం ఐసిడిఎస్ సూపర్ వైజర్స్ మనీలా, రోజా రమణిల ఆధ్వర్యంలో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి పద్మావతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గర్భిణీలకు, బాలింతలకు పోషక విలువలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్వాడీ సిబ్బందిపై ఉందని సిడిపిఓ షేక్ మెహబూబి సూచించారు. గూడూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భి పడాయి భి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాంచన, ఉపాధ్యాయులు మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం సిడిపిఓ కుమారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రమణయ్యల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భి పడాయి భి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవకుమారి మాట్లాడుతూ వికలాంగులకు న్యూట్రిషన్ హెల్త్, గ్రోత్ చిల్డ్రన్స్ నవ చేతన, ఆధార్ శీల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని అంగన్వాడి కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు యమున, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు :

పోషణ్ భీ - పడాయి భీ కార్యక్రమంలో అంగన్వాడీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

మండలంలో గురువారం పోషణ్ భీ – పడాయి భీ కార్యక్రమంపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోషణ, ప్రీస్కూల్ కార్యక్రమాలపై అవగాహన, బిడ్డ పుట్టినప్పుడు నుండి వారిలో కలిగే డెవలప్మెంట్ గురించి తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణమంజరి, సూపర్వైజర్ ప్రగతి శిరీష, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యర్రావారిపాలెం:

ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా అంగన్వాడి కార్యకర్తలకు మండలంలో మూడు రోజులు పాటు పోషణ్ బి, పడాయి బి, కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక ఎదుగుదల ఎంత ముఖ్యమో మానసిక అభివృద్ధి అంతా ముఖ్యమని తెలిపారు. పోషణ అభియాన్ ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని విద్యార్థులకు అందించడం ద్వారా మానసిక అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌పై అవగాహన

శిక్షణ కార్యక్రమంలో సూచనలిస్తున్న సూర్వైజర్లు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని కోట జడ్పీ హైస్కూల్, చిట్టేడు జడ్పీ హైస్కూల్స్‌లో మండలంలోని అంగన్వాడి టీచర్లకు, సిడిపిఓ మునికుమారి ఆదేశాల మేరకు సూపర్వైజర్ల కృష్ణమ్మ, కవిత ఆధ్వర్యంలో పోషణ్ భీ పడాయి బీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో 0-6 సంవత్సరాల పిల్లలుకు అంగన్వాడీ స్కూల్‌లో విద్యాభ్యాసం ఎలా నిర్వహించాలి, ఎలాంటి పోషణ అందజేయాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పూర్వ బాల్య దశ లోని పిల్లలు యొక్క విధి విధానాలను అంగన్వాడి టీచర్లకు వివరించారు. మండలంలో రెండు చోట్ల ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంగన్వాడి సూపర్వైజర్ కవిత కృష్ణమ్మ తెలిపారు. ఒక్కొక్క చోట 35 మంది చొప్పున 70 మంది రెండు చోట్ల ట్రైనింగ్ పొందుతున్నారని వివరాంచారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి సూపర్వైజర్లు కవిత, కృష్ణమ్మ, అంగన్వాడీ టీచర్లు రాజేశ్వరి, కోమది, రూప, ఆర్.వి.రమణమ్మ తదితరులు ఉన్నారు.

కాంప్లెక్స్ సమావేశాల్లో మార్పు చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్కూల్ కాంప్లెక్స్ సమావేశ సమయాల్లో మార్పు చేయాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి మురళీకృష్ణ, బి బాలసుబ్రమణ్యం గురువారం సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతనంగా విద్యాశాఖ విడుదల చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు నుండి 11:45 వరకు పాఠశాల విధులు నిర్వహించుకుని, మధ్యాహ్నం 1గంటకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విధానం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రయాణం ఇబ్బందులు ఏర్పడుతాయని అన్నారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు ఎక్కువగా ఇబ్బంది పడే అవకాశాలంటాయని వాపోయారు. విద్యాశాఖ సి ఆర్ సి సమావేశాలను ఉదయం తొమ్మిది నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకు నిర్వహిస్తే సత్ఫలితాలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కె వెంకటాద్రి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్ బాబు, చంద్రశేఖర్, మస్తాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ ఖ్యాతిని దిగజార్చొద్దు

తిరుపతి(మంగళం) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎవరినీ కించపరిచే చర్యలకు దిగడం లేదని, 100 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి టౌన్ బ్యాంక్ ఖ్యాతిని దిగజార్చే విధంగా వైస్ చైర్మన్ వాసు యాదవ్ తన ఛాంబర్ ను బారుగా మార్చడంతో అతని చాంబర్ ను తొలగించడం జరిగిందని జనసేన పార్టీ కార్యదర్శి రాజేష్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపొందానని చెప్పుకునే వాసు యాదవ్ టౌన్ బ్యాంకు ఖాతాదారులకు జవాబుదారీతనంగా ఉండాల్సింది పోయి లోన్లు కోసం వచ్చే వారితో కమిషన్ల కోసం బేరసారాలు చేస్తున్నారని, బ్యాంకు చుట్టూ ఉన్న తోపుడుబండ్ల వారిని బెదిరిస్తూ ముడుపులు చెల్లించాలంటూ బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. దొంగ బంగారం పెట్టి లోన్లు పొందినట్లుగా ఆరోపణలు ఈ మధ్య వచ్చాయన్నారు. టౌన్ బ్యాంకు లావాదేవీలపై సిట్ ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నామన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బాబ్జి, ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆచారి పాల్గొన్నారు.

యాదవుల స్వేచ్ఛను కూటమి హరిస్తోంది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెనుకబడిన తరగతుల నాయకులను, యాదవులను అణిచివేత దిశగా చర్యలు తీసుకుంటూ వారి స్వేచ్ఛను హరిస్తోందని తిరుపతి టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్ ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాజాగా తిరుపతిలో ప్రత్యేక అనుమతి ద్వారా టౌన్ బ్యాంకు చైర్మన్ కు ఏ విధంగా చాంబర్ ఉంటుందో, అదేవిధంగా వైస్ చైర్మన్ కు ప్రత్యేక ఛాంబర్ ను ఏర్పాటు చేసుకోవడానికి వైసిపి హయాంలో ఆర్సిఎస్ నుండి ప్రత్యేక అనుమతి పొందామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుపతి ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్ రాజ్యాంగేతర శక్తిగా మారి తనకు కేటాయించిన ఛాంబర్ ను బ్యాంకు సిబ్బందిచే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించారన్నారు. తనకు ముందస్తు సమాచారం లేకుండా ఛాంబర్ తొలగింపుపై ఆర్ సి ఎస్, ఆర్.బి.ఐ కు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బత్తల అరుణ్ యాదవ్, వడ్డెర రమణ పాల్గొన్నారు.

నిర్ధారణ లేకుండా సిఎం అనుచిత వ్యాఖ్యలు

- మీడియాతో టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి : ఎటువంటి నిర్ధారణ లేకుండా సిఎం చంద్రబాబునాయుడు సెప్టెంబర్ 20న శ్రీవారి లడ్డులో ఆవు, పందికొవ్వు కలిసిందని వ్యాఖ్యలు చేయడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని, సిబిఐ రిమాండ్ రిపోర్టులోనూ ఎక్కడా నిర్ధారణ కాలేదని, సనాతన ముసుగులో రాజకీయం చేసి, ప్రత్యర్థుల పార్టీలను నాశనం చేయాలని చూస్తున్నారని టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది తమపై నింద కాదని, సాక్షాత్తు శ్రీవారిపై నింద మోపారన్నారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మానికి విఘాతం కలిగితే తాను ముందుంటానని చెప్పిన పవన్ ఇపుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగిందని ఆనాడు వైఎస్‌ఆర్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారని, ఇపుడు సిఎం చంద్రబాబు ముంతాజ్ హోటల్‌కు అనుమతులు ఎలా ఇచ్చారని, వాటిని రద్దు చేయాలన్నారు. తిరుపతిలో జరుగుతున్న స్వామీజీ ఆమరణ నిరాహారదీక్షకు వచ్చి మద్దతు ఇవ్వాలని కోరారు. సనాతనం ముసుగులో దేవాలయ పవిత్రతను దిగజార్చుతున్నారని పవన్‌కల్యాణ్‌పై మండిపడ్డారు. గన్నవరం మాజీ ఎంఎల్‌ఏ వల్లభనేని వంశీ అరెస్టును ఖండించారు. ప్రతీకారంతోనే వైసిపి నేతలను అరెస్టులు చేస్తున్నారన్నారు.

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమంలో ఆలయ శుద్ధి చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) శ్రీ నివాసమంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 18 నుండి ఫిబ్రవరి 26 వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు. తిరుపతికి చెందిన మణి రెండు పరదాలు, రెండు కురాళాలు ఆలయానికి విరాళంగా అందించారు. 17వ తారీఖున శ్రీ కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 18వ తేదీన బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నట్లు స్పెషల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజకుమార్, రమేష్ కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని కుమార్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల్ నగర్‌లో నివాసం ఉండే చల్లా వెంకటకృష్ణ (చిన్నా) అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ రూ.25 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రధాన కార్యదర్శి చెన్నరాయప్ప, టిడిపి రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, అనూష, పట్టాభిరామ్, సుధాకర్, శ్రీనివాసులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సర్వే పూర్తి చేయాలి

చంద్రగిరి సచివాలయం పరిశీలనలో డిఎల్‌డీఓ నారాయణరెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): గ్రామ సచివాలయ పరిధిలో హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ సర్వేతో పాటు వివిధ రకాల సర్వేలను వెంటనే పూర్తి చేయాలని జిల్లా గ్రామ సచివాలయ వార్డు సేవల అధికారి, డిఎల్‌డిఒ నారాయణరెడ్డి సూచించారు. చంద్రగిరి పంచాయతీలోని సచివాలయాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ప్రజలకు అందించాల్సిన సేవలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. తమ పరిధిలోని సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన సర్వేలను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎల్ అండ్ టి'తో మోహన్‌బాబు యూనివర్సిటీ ఒప్పందం

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి) అకడమిక్ ఎక్సలెన్స్ దిగ్గజం మోహన్ బాబు యూనివర్సిటీ, పారిశ్రామిక దిగ్గజం ఎల్ అండ్ టి కలిసి 'ఎడ్యుకేట్ ఇండియా' థీమ్ ను అనుసరించి ఎంఓయు ను కుదుర్చుకున్నారు. గురువారం ఎల్ అండ్ టి కాలేజ్ కనెక్ట్ అధిపతి ఫెబిన్ మోహన్ బాబు యూనివర్సిటీ ని సందర్శించి ఎడ్యుకేట్ ఇండియా ఆవశ్యకత ను విద్యార్థులకు విశదీకరించారు. ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి మాట్లాడుతూ మోహన్ బాబు యూనివర్సిటీ నందు విద్యార్థులకు కావలిసిన అన్ని సదుపాయాలను ఇండస్ట్రీ అవసరాలకు తదనుగుణంగా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. విద్యార్థులు ఈ ఇండస్ట్రీ స్టాండర్డ్ సదుపాయాలను పూర్తిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నందు ప్రొవోస్ట్ ప్రొఫెసర్ నాగరాజ్ రామారావ్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కరుణాకరన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సారథి, విద్యార్థులు పాల్గొని ఈ ఒప్పందం పట్ల తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

మేఘాలయ ప్రభుత్వంతో 'క్రియా' ఒప్పందం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: డేటా వ్యవస్థలను మెరుగుపరచడానికి, ఆవిష్కరణలను పెంపొందించడానికి, విధాన అమలును, ప్రోత్సహించడంలో భాగంగా అవగాహన ఒప్పందంపై క్రియా విశ్వవిద్యాలయం మేఘాలయ ప్రభుత్వంచే అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇందులో భాగంగా తమ విశ్వ విద్యాలయంలో సినర్జీ 2025 నిర్వహించామన్నారు. 'అభివద్ధిలో అత్యంత ముఖ్యమైన కొన్ని సమస్యలను లోతుగా చర్చించడానికి, విమర్శనాత్మకంగా విశ్లేషించడానికి, పరిష్కారాలు, కార్యాచరణపై దష్టి పెట్టడానికి సినర్జీ ఒక ప్రత్యేకమైన వేదిక' అని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్. కష్ణన్ మాట్లాడుతూ పరివర్తన ప్రభావాన్ని, ఈ రంగంలో సంభవిస్తున్న టెక్టోనిక్ మార్పులను హైలైట్ చేశారు. డాక్టర్ సంపత్ కుమార్, మేఘాలయ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, డెవలప్మెంట్ కమిషనర్ కపిల్ విశ్వనాథన్, ప్రెసిడెంట్, ఐ ఎఫ్ ఎమ్ ఆర్ సంతకం చేసిన ఈ ఒప్పందం, డేటా ఆధారిత పాలనలో మేఘాలయ మార్గదర్శక కార్యక్రమాలను రూపొందిస్తుంది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ అశోక్ ఝున్‌ఝున్‌వాల పాల్గొన్నారు.

ఏజి పి ప్రథమ్‌లో థింక్ గ్యాస్ విలీనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ప్రముఖ గ్యాస్ ఆధారిత సంస్థ ఏజి పి ప్రథమ్ సంస్థ, థింక్ గ్యాస్ తమ విలీన బ్రాండ్ సంస్థ ను ప్రకటించడానికి వేదికగా ఇండియా ఎనర్జీ వీక్ 2025ను తీసుకున్నాయి. ఈ కార్యక్రమంలో పెట్రోలియం, నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు చైర్‌పర్సన్ డాక్టర్ అనిల్ కుమార్ జైన్, థింక్ గ్యాస్ చైర్మన్ అమితవ సేన్‌గుప్తా, థింక్ గ్యాస్ ఎండి, సీఈఓ అభిలేష్ గుప్తా, ఎ. రమణ కుమార్, సభ్యులు – పి ఎన్ జి ఆర్ బి తకేషి షినోహర సాన్, ఎండి, ఒసాకా గ్యాస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమక్షంలో విలీన బ్రాండ్ కొత్త రూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ జైన్ మాట్లాడుతూ 'భారతదేశ వద్ధికి తోడ్పడుతూనే, పర్యావరణ అనుకూల అభివద్ధిని నడిపించే ఇంధన పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి, కొత్త బ్రాండ్‌తో వేగవంతమైన వద్ధికి మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము' అని అన్నారు. అమితవ సేన్‌గుప్తా మాట్లాడుతూ 'దేశంలోని అతిపెద్ద సహజ వాయువు నెట్‌వర్క్‌లలో ఒకదాన్ని అభివద్ధి చేయడం, స్థాపించడం మా లక్ష్యం'అని అన్నారు. రాబోయే 8 సంవత్సరాలలో యుఎస్‌డి 1 బిలియన్ పెట్టుబడి పెట్టడంతో పాటుగా , తమ నెట్‌వర్క్‌ను 24వేల అంగుళాల కిలోమీటర్ల స్టీల్ పైప్‌లైన్‌లకు విస్తరించాలని, 180 మిలియన్లకు పైగా కస్టమర్ల అవసరాలను తీర్చడం లక్ష్యంగా, 3,24,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 2వేల కంటే ఎక్కువ సిఎన్జి స్టేషన్ల బలమైన నెట్‌వర్క్‌ను సష్టించాలని నిర్ణయించామన్నారు. థింక్ గ్యాస్ ఎండి, సీఈఓ అభిలేష్ గుప్తా మాట్లాడుతూ 'భారతదేశ ఇంధన మిశ్రమంలో సహజ వాయువు వాటాను పెంచాలనే ప్రభుత్వ లక్ష్యంలో కీలక పాత్ర పోషించడానికి మేము కట్టుబడి ఉన్నాము' అని అన్నారు.